క్లుప్తంగా

సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలకంరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్

మాడ్గుల: మాడ్గుల పీహెచ్‌సీలో మండల సిబ్బంది, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం.. మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నులిపురుగుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. గురువారం ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు మండలంలో ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తారని అన్నారు. గర్భిణులు, రెండు సంవత్సరాల లోపు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారికి తప్ప 2 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికి మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దయాకర్, అలివేలు, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ఎంఈఓ సర్దార్ నాయక్



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ సర్దార్ నాయక్

మాడ్గుల: ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంఈఓ సర్దార్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలో అంతంపేట, అర్కపల్లి తదితర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య తక్కవగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటివి మరోమారు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. బడులు ప్రారంభమైనందున ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరుకావాలని, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు లు, మండల అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా

ఎంపీపీ కొప్పు సుకన్య



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం కాలనీలో ఆమె పర్యటించారు. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు ఇళ్ల మధ్యనే నిల్వ ఉంటుందని.. దుర్వాసన, దోమలు వృద్ధి చెందటంతో రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని ఎంపీపీ వారికి హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య, సిబ్బంది ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు, కుత్బుల్లాపూర్‌కి చెందిన అల్వాల్ పెంటయ్య 2019 ఏడాలిట మృతిచెందాడు. సహకార సంఘం తరఫున అందించే రూ.15వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్.. మృతుడి భార్య రేణుకకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాములు, అకౌంటెంట్ రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- డాక్టర్స్ కాలనీలో ఒరిగిన విద్యుత్ స్తంభం
- భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని అధికారులు

హుడాకాంప్లెక్స్: వెలుగులు పంచాల్సిన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందో తెలియక స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. స్తంభం ఇప్పటికే ఒక వైపు పూర్తిగా ఒరిగిపోయింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి నేలకూలే ప్రమాదం నెలకొంది. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీ రోడ్ నం.6లోని విద్యుత్ స్తంభం కేబుల్ వైర్ల తాకిడికి ఒకవైపుకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా స్థానికులు పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

స్తంభాలకు ముప్పుగా కేబుళ్లు..

ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభం వద్ద నుంచే వాహనదారులు రాకపోకలు సాగిస్తుండంతో..అటుగా రాకపోకలను నిషేధించారు. పాదచారులు,వాహనదారులు అటువైపు రాకుండా అడ్డుగా ముళ్లకంచెను ఏర్పాటు చేయడంతో పాటు సూచిక బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

అధికారులు పట్టించుకోవడం లేదు



కాలనీలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారిందని.. దాన్ని తొలగించి కొత్తగా మరో స్తంభాన్ని ఏర్పాటు చేయాలని పలు మార్లు అధికారులకు విజ్ఞప్తి చేశాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. స్తంభం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఉన్నతాధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలి.

– శ్రీనివాసరావు, డాక్టర్స్ కాలనీ



డాక్టర్స్‌కాలనీలోని ఓ వీధిలో ఒరిగిన స్తంభం

సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కందుకూరు ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈఓ మనోహర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు, సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడారు. ఐదునెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు, వంట బిల్లులు అందక అప్పుల పాలవుతున్నారన్నారు. అధికారంలోకి రాకముందు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారిస్తామన్న కాంగ్రెస్, వారి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు గడుస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు. ఏడాదిలో రెండు, మూడు పర్యాయాలు మాత్రమే బిల్లులు ఇవ్వడం దారుణమన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచి, పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి ప్రభావతి, ఆండాలు, అశ్విని, లక్ష్మమ్మ, భారతమ్మ, భాగ్యమ్మ, కలమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మనోహర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని సార్లరావులపల్లిలో గ్రామ ప్రత్యేకాధికారి సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు 2010 సంవత్సరంలో మూతబడిన పాఠశాలను తిరిగి పునః ప్రారంభిస్తున్నామన్నారు. సార్లరావులపల్లిలోని ప్రాథమిక పాఠశాలకు ఈ నెల 6వ తేదీన డిప్యూటేషన్‌పై ఒక ఉపాధ్యాయుడిని నియమించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారన్నారు. అందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీ మల్లేశ్, ఆకులమైలారం కాంప్లెక్స్ హెచ్‌ఎం అరుణాకుమారి, పంచాయతీ కార్యదర్శి పి.జగదీశ్వర్‌రెడ్డి, ఏ.జహంగీర్, సీఆర్పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



బడి బాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య పనులు



హస్తినాపురం పద్మావతి కాలనీలో రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్త

కాలనీల్లో రోడ్లవెంట పేరుకుపోయిన చెత్త

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పలు కాలనీల్లో అంతర్గత రోడ్ల వెంట చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. కాలనీల ప్రజలు పలువురు తమ ఇళ్లల్లోని చెత్తను, వేడుకల సందర్భంగా తిన్న ప్లేట్లను, గ్లాసులను, మిగిలిన ఆహార పదార్థాలను, ఇతర వ్యర్థాలను బ్యాగుల్లో తెచ్చి ఓపెన్ ప్లాట్లలో పడేసి పోతున్నారు. దీంతో పలు కాలనీళ్లకు రోడ్ల వెంబడి అనధికార డంప్ బిన్లు ఏర్పడుతున్నాయి. కాగా చెత్తను రోడ్ల వెంబడి పారేయకుండా చూడటంలోనూ, అలా పోగైన చెత్తను సకాలంలో అక్కడినుంచి డంపింగ్ యార్డులకు తరలించడంలోనూ శానిటేషన్ అధికారులు, సిబ్బంది విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజులకొద్దీ చెత్త కాలనీల పరిసరాల్లో పేరుకు పోతుండటంతో అక్కడ కుక్కలు సంచరిస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు రోడ్ల వెంబడి చెత్తను వేయకుండా చేయడంతో పాటు పోగైనా చెత్తను వెంటనే అక్కడి నుంచి తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

వాన నీటిని ఒడిసి పట్టేద్దాం

మన్సూరాబాద్: వాక్ ఫర్ వాటర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వర్షపు నీటిని ఒడిసి పట్టే సరికొత్త ప్రాజెక్టును మన్సూరాబాద్ డివిజన్ సహారాస్టేట్స్ కాలనీలో మంగళవారం ప్రారంభించారు. కాలనీలో చెత్తాచెదారంతో నిండిపోయిన 12 ఇంకుడు గుంతలు, 2 ఓపెన్ వెల్స్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాలనీ మెయింటెనెన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ జానీ మాట్లాడుతూ, ప్రతీ వర్షం బొట్టును ఇంకుడు గుంతలు, ఓపెన్ వెల్స్‌లోకి మళ్లిస్తే భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కాలనీవాసుల సహకారంతో వాన నీటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాక్ ఫర్ వాటర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, నీటి సంరక్షణకు కాలనీవాసులు ముందుకు రావటం అభినందనీయమని, ఇలాంటి ప్రాజెక్టులు పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడిని తగ్గిస్తాయన్నారు. సుమారు 42 ఎకరాల్లో విస్తరించి ఉన్న సహారా స్టేట్స్ కాలనీలో 1500 మిలియన్ లీటర్ల వర్షపు నీటిని సంరక్షించే ప్రాజెక్టును ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీనివాసరావు, మేకల ప్రభాకర్‌రెడ్డి, నర్సింహగౌడ్, గంగదాసు కృష్ణారెడ్డి, కేఎస్ నర్సింహచారి పాల్గొన్నారు.



ఇంకుడు గుంతల్లో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్న కాలనీవాసులు

ఉపాధి హామీ పనుల పరిశీలన

మంచాల: ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీలో భాగంగా మంచాల మండలంలో మంగళవారం ఆ శాఖ అధికారులు ఉపాధి పనులను పరిశీలించారు. మంచాల గ్రామంలోని హరిత వనాలు, నర్సరీలోని మొక్కల పెంపకం వంటి పనులను పరిశీలించారు. మండలంలో ఈ ఏడాది ఉపాధి పనుల కింద రూ.3కోట్ల15లక్షల మేర పనులు చేశారు. ఈనెల 21న మండల స్థాయిలో సామాజిక తనిఖీ బహిరంగ సదస్సు నిర్వహించనున్నట్లు డీఆర్‌పీ మహేష్, టీఏ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయులకు ప్రమోషన్లు

తలకొండపల్లి: స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు జీహెచ్‌ఎంగా ప్రమోషన్ వచ్చినట్లు ఎంఈఓ సర్దార్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న భగవాన్‌రెడ్డి ప్రమోషన్‌పై జీహెచ్‌ఎంగా చారగొండకు, చుక్కాపూర్‌లో పనిచేస్తున్న పాపిరెడ్డి ప్రమోషన్‌పై జీహెచ్‌ఎంగా దిండి, ఖానాపూర్‌లో పనిచేస్తున్న కర్ణారెడ్డి ప్రమోషన్‌పై జీహెచ్‌ఎంగా కందుకూర్, పడకల్‌లో విధులు నిర్వహిస్తున్న చల్మారెడ్డి ప్రమోషన్‌పై జీహెచ్‌ఎంగా కారువంగ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు వెళ్లారని ఎంఈఓ సర్దార్‌నాయక్ చెప్పారు. అదే విధంగా మండలంలోని వెల్జాల్ జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులుగా నజియా సుల్తానా, గట్టు ఇప్పలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వెంకటయ్య బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈఓ తెలిపారు.

హస్తినాపురానికి నిధులు కేటాయించాలని వినతి



హస్తినాపురం: డివిజన్‌లోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ కోరారు. ఈ మేరకు ఆమె మంళవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్, ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కల్లు విక్రయాల్లో నిబంధనలకు తూట్లు

- గీత కార్మికులపై చర్యలు తీసుకోవాలి
- మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నిబంధనలు పాటించని గీత కార్మికులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు కొమ్మిడి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లిలో గీత కార్మికులు ఇష్టారాజ్యంగా కల్లు విక్రయాలు జరుపుతున్నారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం రైతులతో కలిసి ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ అధికారులకు ఆయన ఫిర్యాదు చేశారు. గీత కార్మికులు సొసైటీ నిబంధనలు ఉల్లంఘించి కల్లు విక్రయాలు జరుపుతున్నారని మండిపడ్డారు. తాటిచెట్ల నుంచి సేకరించిన కల్లును వేరువేరుగా విక్రయించకుండా ఒకే దగ్గర విక్రయించాలని కోరారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న తాటిచెట్లను తొలగించాలని కోరారు. పంట పొలాల్లో ఉన్న తా టిచెట్ల నుంచి మట్టలు, తాటికాయలు పడి.. పంట పొలాలు పాడై పోతున్నాయని అన్నారు. గీత కార్మికులు పొలాల్లో పడిన తాటి మట్టలు, ముంజకాయలు తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రైతులకు ఇబ్బంది కల్గిస్తున్న గీత కార్మికులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య, గ్రామస్తులు వెంకటేశ్, యాదయ్య, బుచ్చిరెడ్డి, శేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

ఎమ్మెల్యే కసిరెడ్డికి బ్రాహ్మణపల్లి గ్రామస్తుల వినతి

ఆమనగల్లు: మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామం నుంచి నల్లగొండ జిల్లా కుర్మేడ్ వరకు ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని గ్రామ మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, నాగయ్య, నాయకులు.. జల్ల రమేష్‌గౌడ్, జోజీ తదితరులు కలిసి వినతి పత్రం అందించారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు. అలాగే పాత బ్రాహ్మణపల్లి నుంచి ఆర్కపల్లి రోడ్డులో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు కోరారు.



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకుల

భూదాన్ భూములను కాపాడండి

సీపీఐ మండల కార్యదర్శి నర్సింహా

నాగోలు: కర్మన్‌ఘాట్‌లోని సర్వే నెంబర్ 57లోని భూదాన్ భూమిని కబ్జాదారుల చెర నుంచి కాపాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ, సహాయ కార్యదర్శి బోయిపల్లి రాములుగౌడ్, కందుల సుధాకర్ మంగళవారం సరూర్‌నగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరంలో భూముల రేట్లు ఆకాశాన్ని అంటడంతో కబ్జాదారులు ప్రభుత్వ భూములను, భూదాన్ భూములను కబ్జా చేస్తూ ఎదురు ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి భూములు కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మేమున్నామని..

- ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతల చేయూత
- పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌ఆర్‌ఐల సహకారంతో మౌలిక వసతుల కల్పన
- డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ఆధునిక ప్రయోగశాల ఏర్పాటు
- పదోతరగతి ఫలితాల్లో సత్తాచాటుతున్న విద్యార్థులు



ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

కడ్తాల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి మేమున్నామంటూ గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంధ సంస్థలతో పాటు ఎన్‌ఆర్‌ఐలు ఒక్కొక్కరిగా చేయూతనందిస్తున్నారు. గతంలో మండల కేంద్రంలో బాలబాలికలకు కలిపి ఒక్కటే ఉన్నత పాఠశాల ఉండేది. విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో 2014లో పాఠశాలను విభజించారు. బాలికల ఉన్నత పాఠశాలను పాత భవనవనంలో వేరుగా ఏర్పాటు చేశారు. పది సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన బాలుర ఉన్నత పాఠశాలను కడ్తాల్ నుంచి అన్మాస్‌పల్లి దారిలో నూతనంగా నిర్మించిన భవనంలో ప్రారంభించారు. పాఠశాలలో మెరుగైన వసతులు, విద్యార్థుల సంఖ్యకు సరిపడా గదులు లేకపోవడంతో పాఠశాల ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు దాతలు ముందుకు వచ్చారు. వ్యక్తులతో పాటు, స్వచ్ఛంద సంస్థలు పాఠశాల అభివృద్ధికి చేయూత నందిస్తుండటంతో పాఠశాల దినదినాభివృద్ధి చెందుతోంది.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా..

పాఠశాలలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా దాతలు విరాళాలు అందించారు. పాఠశాలలో విద్యార్థులకు తరగతిగదుల కొరత లేకుండా లక్షలు వెచ్చించి, అదనపు గదులు నిర్మించారు. డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు ఎల్‌ఈడీ టీవీలతో పాటు ఎల్‌ఈడీ ప్రొజెక్టర్లను అందించారు. విద్యార్థులు సాంకేతికంగా మరింత రాణించాలనే లక్ష్యంతో అధునాతన సైన్స్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. అలాగే అనేకమంది దాతలు పాఠశాల అభివృద్ధికి తమవంతు తోడ్పాటునందించారు.

మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం



పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయం, సేవలు మరువలేనిది. అన్ని వసతులు కల్పించడంతో విద్యార్థులు కూడా ఏకాగ్రతతో చదువుపై దృష్టి సారిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించాం. పదోతరగతి ఫలితాల్లో ప్రతి ఏడాది మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం.

– జంగయ్య, హెచ్‌ఎం, కడ్తాల్